

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డు ఉన్న మిత్ర యోగా సెంటర్ లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను ఈనెల 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె. కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ లో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి,డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడవ బ్యాచ్ ఉంటుందన్నారు. వివరాలకు 9848861206, 7013238986లలో సంప్రదించాలని తెలిపారు.

'వంద' రోజుల 'హౌ'సింగ్

- ఆరు వేల ఇళ్లు పూర్తి ఎన్నడో?
- పెండింగ్‌లో రూ.8 కోట్ల బకాయిలు
- మౌలిక వసతుల కొరతతో సతమతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో వంద రోజుల హౌసింగ్ ప్రణాళిక నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాలుగో వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా వంద రోజుల్లో లక్ష పక్కాగృహాలను ప్రారంభించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. రాష్ట్ర హౌసింగ్ డిపార్టుమెంట్ ఆదేశాల మేరకు జిల్లా హౌసింగ్ యంత్రాంగం వంద రోజుల ప్రణాళికలో భాగంగా తొమ్మిది వేల పక్కా గృహాలను పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించుకుంది. క్షేత్రస్థాయి పరిస్థితులను మదింపు వేసుకున్న అనంతరం ఆరు వేల పక్కాగృహాలను పూర్తి చేస్తామని లక్ష్యాన్ని కుదించుకుంది. జిల్లా హౌసింగ్ యంత్రా ంగం 2025 నాటికి పెండింగ్ పక్కా గృహాలను పూర్తి చేయా లని, లేనిపక్షంలో పిఎంజిఎస్‌వై స్కీమ్ ముగిసి పోయే ప్రమా దం ఉందని అవగాహన కల్పించడంతో పాటు లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో 94 పక్కాగృహాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 89,984 ఇళ్ల నిర్మాణ పనులు పట్టాలెక్కాయి. మైదుకూరు, పులివెందుల, కమలాపురం డివిజన్లలో పురోగతి కనిపిస్తోంది. కడప, ప్రొద్దుటూరు డివిజన్లలో ఆశించిన పురోగతి కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది నవంబర్ నాటికి 36 వేల ఇళ్లు పూర్తయ్యాయి. ఈలెక్కన 41 శాతం మేరకు పనులు చేపట్టిన్లు తెలుస్తోంది. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో డిసెంబర్ నాలుగో వారం నాటికి వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలో ఆరు వేల పక్కాగృహాలను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. హౌసింగ్ యంత్రాంగం ముందుకు కదులుతోంది. ఇప్పటి వరకు 2,000 పక్కాగృహాల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేసింది. రాబోయే 30 రోజుల వ్యవధిలో లక్ష్యాన్ని ఎలా అధిగమించాలో తెలియడం లేదు. మరో నెల రోజుల వ్యవధిలో మరో 500 పక్కాగృహాలకు మించి పూర్తి చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది.

మౌలిక వసతుల కుంగుబాటు

జిల్లాలోని 436 లేఅవుట్లలో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. మౌలిక వసతుల కొరత కారణంగా ఆశించిన రీతిలో పక్కా గృహాల నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. జిల్లా హౌసింగ్ యంత్రాం గం ఆయా లేఅవుట్ల వారీగా సమస్యల్ని అధ్యయనం చేయడంపై దృష్టి సారించింది. ప్రతి లేఅవుట్ లోనూ నీటి సరఫరా, రహదారులు, ఎలక్ట్రిఫికేషన్, వస్తువుల అపహరణ వంటి సమస్యల్ని, సదుపాయాల లోపాల్ని గుర్తించింది. ఎలక్ట్రిఫికేషన్ సదుపాయాల కల్పనకు చొరవ తీసుకున్నట్లు చెబుతోంది. నీటిసరఫరా, రహదారుల, దొంగతనాల నిరోదం అంశాల్లో నిమ్మకుండి పోయినట్లు తెలుస్తోంది.

రూ.8 కోట్ల బకాయి పెండింగ్!

హౌసింగ్ పనులను మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. లేఅవుట్లలో నెలకొన్న సమస్యల్ని గుర్తించినట్లు తెలుస్తోంది. హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు, బకాయిలపై ఆరా తీసింది. రూ.ఎనిమిది కోట్ల మేరకు నీటి సర ఫరా బకాయి పేరుకుని ఉన్నట్లు గుర్తించింది. పెండింగ్ బకాయి ప్రతిపాదనల్ని ప్రభుత్వా నికి నివేదించినట్లు తెలు స్తోంది.

11 వేల మందికి నోటీసులు

పిఎంజిఎస్‌వై స్కీమ్-2025 నాటికి ముగిసి పోనుంది. జిల్లా హౌసింగ్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని పెండింగ్ లబ్ధిదారులను గుర్తించి పక్కాగృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరుతోంది. అవగాహనా కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిన వారికి నోటీసులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 18 వేల మంది పెండింగ్ లబ్ధిదారులు ఉండగా, ఏడు వేల మంది పెండింగ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన 11 వేల మంది పెండింగ్ ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.



మౌలికం కొరత వాస్తవమే

పక్కాగృహాల లేఅవుట్లలో మౌలిక వసతుల కొరత ఉన్నమాట వాస్తవమే. వంద రోజుల ప్రణాళిక లక్ష్యాన్ని అధిగమించే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

- రాజారత్నం, హౌసింగ్ పీడీ, కడప.

పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితా

- జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు

ప్రజాశక్తి - కడప

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె. కన్నబాబు (రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి) ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలను ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2025లో భాగంగా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జెసిఅదితి సింగ్‌లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమిషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదులో వివరాలు, పక్కాగా నమోదు చేయాలని సూచించారు. బిఎల్ఒలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనలు పాటించి నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 16,41,347 మంది ఓటర్లు ఉన్నారని, ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8కు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్‌ను పరిశీలించడం జరుగుతోందన్నారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాసులు, కడప ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటపతి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె. కన్నబాబు

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సభాభవన్‌లో సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికల నిర్వహణపై జిల్లా నీటి వనరుల శాఖ, మండల అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన చెరువులకు సంబంధించి డిసెంబర్ 8న నీటి వినియోగదారుల/సాగునీటి సంఘాల ఎన్నికలు 5న సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడనుందన్నారు. ఇందులో నామినేషన్ల ప్రక్రియ, ఆరుగురు ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మైనర్, మీడియం, మేజర్ అనే మూడు కేటగిరీల నీటి వనరులకు ఎన్నికలుంటాయని చెప్పారు. జిల్లాలో 3 ప్రాజెక్టు కమిటీలు, 11 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 205 నీటి వినియోగదారుల కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్నికల్లో ఎన్నికల విధుల నిర్వహణపై పిపిటి ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలి .. ప్రజా సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సభా భవన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికపై అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇతర అధికా రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పరిష్కార సమస్యల పరిష్కారక వేదికకు వచ్చే ప్రతి అర్జీ దారునీ బాధను సహృదయంతో అర్థం చేసుకొని ఆప్యాయతతో నవ్వుతూ అధికారులు అర్జీలను స్వీకరించాలన్నారు అర్జీదారునికి ఇచ్చే పరిష్కారంలో నాణ్యత లేకపోయినా, సరైన సమాచారం ఇవ్వకపోయినా, అర్జీదారునికి సరిగా స్పందించకపోయినా ఉపేక్షించేది లేదని అధికారులను కార్యక్రమంలో పిజిఆర్ఎస్ నోడల్ అధికారి సురేష్ అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ కే ప్రకాష్ బాబు, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, సిపిఒ వెంక ట్రావు, డిఎంఅండ్‌హెచ్ఒ నాగరాజు, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, ఎంపిడిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

బడి వైపునకు ఒక అడుగు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం - బడి వైపునకు ఒక అడుగు' తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముందుకు రావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌పై ఎంఇఒలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ రంగమైన అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బలంగా విశ్వసించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాభివృద్ధిలో కూడా సమాజం కీలక భాగస్వామి కావాలన్నదే వారి ప్రధాన ఆకాంక్ష అన్నారు. ఇందులో భాగంగానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ని దేశంలోనే ఆదర్శవంతంగా నిర్వహించాలని సంకల్పించాలరని అన్నారు. 2009 సంవత్సరంలో భారత ప్రభుత్వం మన పిల్లల కొరకు 'బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం' తీసుకొచ్చారని చెప్పారు. దేశంలోని 6-14 సంవత్సరాల లోపు వయసు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను ఒక హక్కుగా గుర్తించారన్నారు. ఎస్ఎంసి సభ్యులు పాఠశాల సిబ్బంది విద్యార్థులతో కమిటీలను ఏర్పాటుచేసి వారికి స్పష్ట మైన విధులు, బాధ్యతలను కేటాయించాలని అన్నారు. కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించడానికి విజయవంతం చేయడం కోసం వారికి కేటాయించిన విధులు బాధ్యతలను రాత పూర్వకంగా స్పష్టం చేయాలని అన్నారు. అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయడానికి ప్రతి కమిటీలో సభ్యులకు సహ కరించుటకు ప్రత్యేకంగా ఒకరిని ప్రతిపాదించి నియమించాలని చెప్పారు. కమిటీలకు కేటాయించిన స్పష్టమైన విధులు, బాధ్యతలు వాటికి ఖరారు చేసిన తేదీలను సంబంధిత వ్యక్తులకు రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సాయంతో తరగతి గదులను రంగు కాగితాలతో అలంకరించాలన్నారు. గది గోడలపై ప్రేరణాత్మక సందేశాలు, విద్యార్థులు తయారుచేసిన కళాకృతులను ప్రదర్శించాలన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశాలను నిర్వహించాలన్నారు.

పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి

ప్రజాశక్తి-కాశినాయన

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్, బి. మనోహర్ , వి. అన్వేష్ డిమాండ్ చేశారు శనివారం ఉదయం నర్సాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేవంలో వారు మాట్లాడారు. మండలం పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో అక్కంగుండ్ల, శావిశెట్టిపల్లి, నాయనపల్లె తదితర రెవెన్యూ గ్రామాలలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, స్థానిక దళితులు, పేదలకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ధనవంతులు, స్థానికేతర్లు, ఇతర ప్రాంతాల చెందిన కబ్జా చేసి అనుభవిస్తున్నారని, వారికి రాజకీయ నాయకులు సహకరిస్తున్నారని చెప్పారు. పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి ఆలోచించే రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్దలు కబ్జా చేస్తుంటూ చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమని వాపోయారు. నూతన ప్రభుత్వం వెంటనే అసెండ్ కమిటీ ద్వారా స్థానిక పేదలకు భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు, లేని యెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున రెవెన్యూ డివిజన్ కార్యాలయ వద్ద ఆందోళనలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మండల పరిధిలో భూకబ్జాదాల చేతల్లో ఉన్న భూముల పట్ల రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్య తీసుకోపోవటం సమంజసం కాదన్నారు పేర్కొన్నారు. ఆకుల నారాయణ పల్లె, ఇటుకలపాడు, శావిశెట్టిపల్లె, వరికుంట్ల కొట్టాల భూమి లేని నిరుపేదలు 12 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారని, ఉన్న వారికి పట్టాలు మంజూరు చేయడంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని పేర్కొన్నారు. వలసలు నివారించడానికి గ్రామీణ పేదలకు మూడు ఎకరాలు భూమి, ఉపాధి పనులు ఏడాదికి 200 రోజుల పాటు కల్పించాలని పేర్కొన్నారు. నేటి ధరలు కనుగుణంగా రూ. 600 కూలి ఇవ్వాలని తెలిపారు. సహకార చినకారు రైతులకు రైతు భరోసా రూ. 20 వేలు ు వెంటనే ఇవ్వాలన్నారు. మహిళలకు నెలకు రూ. 1500 ఇవ్వాలని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పోలయ్య, కలసపాడు సిపిఎం మండల నాయకులు గురువయ్య, బ్రహ్మంగారిమఠం మండలం నాయకులు సునీల్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప

ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయకుండా 'కూటమి' చవట ప్రభుత్వంలా మారిందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. దాన్ని కప్పి పుచ్చుకునేందుకు సోషల్ మీడియా, వైసిపి కార్యకర్తలను వేధిస్తున్నారు అని తెలిపారు. శనివారం జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూడిద పంచాయితీని కూడా ముఖ్యమంత్రి స్థాయిలో చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమ ర్శించారు. ఫ్లయాస్‌ను దోచుకు నేందుకు కూడా ఇలా పంచాయితీలు చేసి మరీ పంచుతున్నారని ఆరోపి ంచారు. ఇసుక కూడా బెంగుళూరు, చెన్నై వంటి నగరాలకు కూడా తరలి స్తున్నారని చెప్పారు. ఐదారు రోజులుగా బూడిద పంచాయితీ కోసం పోలీసులంతా ఆర్‌టిపిపి వద్ద కాపలా కాస్తున్నారు అన్నారు. వేరే జిల్లా నుంచి దండయాత్రకు వస్తుంటే లా అండ్ ఆర్డర్‌ని కంట్రోల్ చేయలేకపోతున్నారని ఎద్దేవ చేశారు. శ్రీశైలం నీటిని విద్యుత్ ఉత్పత్తి పేరుతో సము ద్రం పాలు చేస్తున్నారు అన్నారు. ఖరీఫ్ తుఫానులతో నష్టపోయింది, రబీ పరిస్థితి కూడా అలానే ఉంది అని తెలిపారు. 215 టిఎంసిలకు గాను శ్రీశైలంలో 124 టిఎంసిల నీరు మాత్రమే ఉందని చెప్పారు. రైతుల భూమి సమస్యలు పరిష్కారానికి వెబ్ సైట్లు కూడా పని చేయడం లేదు అని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్‌కుమార్, నిత్యా నందరెడ్డి, బిహెచ్ ఇలియాస్, కరీ ముల్లా, రామకృష్ణరెడ్డి, వినోద్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి - చెన్నూరు : స్థానిక హిందూ శ్మశాన వాటికలో మానవతా ఆధ్వర్యంలో శనివారం డోజర్‌తో కంప చెట్లను తొలగించారు. మానవత సేవా సంస్థ మాజీ అధ్యక్షులు జి ఎన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ శ్మశాన వాటికలో చెట్లు, పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరగడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉందని కొందరు తమ దృష్టికి తీసుకొచ్చారు. యంత్రం ద్వారా కంపచెట్లను పిచ్చి మొక్కు తొలగించి శుభ్రం చేయించామన్నారు. కార్యక్రమంలో మానవతా ఉపాధ్యక్షుడు నీలం శ్రీనివాస్ రెడ్డి, ఆటో బాబు పాల్గొన్నారు

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి -గోపవరం : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు, అంగన్వాడీ పిల్లలకు తప్పని సరిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పిహెచ్‌సి వైద్యులు శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం బద్వేల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు ఏర్పాటు చేశారు. కంటి, చెవి, ముక్కు, బరువు, రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జె వినయ్‌కుమార్, డాక్టర్ శరత్సంద్ర, డాక్టర్ సౌమ్య, ఆప్తమాలిక ఆఫీసర్ సి. హుస్సేన్, హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంకయ్య ,హెల్త్ సూపర్‌వైజర్ కె. వెంకటమ్మ, శివరాంరెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల బద్వేల్ ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రతి మహిళకు సైబర్ నేరాలు, భద్రత, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వనజ తెలిపారు. నగరంలోని ఆర్తీ ఉమెన్ సెంటర్‌లో శనివారం ఎఫ్ఒజిఎస్ఐ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ధీర అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వనజ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే శారీరక, మానసిక, సైబర్ నేరాల నుంచి ఎలా బయటపడాలి అనే వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్తీహోం సెక్రటరీ దుర్గ కుమారి ఆర్తీ ఉమెన్ సెంటర్ కో-ఆర్డినేటర్ గీత ఆర్తీ హోం సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై ఆదివారం సెమీ క్రిస్మస్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు డ్రీమ్ మీడియా వారి సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



శివప్రసాద్‌రెడ్డి

సమాజంలో యువత పాత్ర కీలకం

ప్రజాశక్తి - కడప

సమాజంలో యువత పాత్ర చాలా కీలకమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ పిలుపు ునిచ్చారు. శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో 'సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ బుల్లీయింగ్, సైబర్ నేరాలపై అవ గాహన కార్యక్రమం' నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ రోజుల్లో యువతలో సోషల్ మీడియా ఉపయోగం ఎలా ఒక ప్రధాన భాగమైందో వివరించారు. ఆ ఉపయోగం బాధ్యతతో కాకుండా దుర్వినియోగానికి, సైబర్ బుల్లీయింగ్, సైబర్ నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల వ్యక్తిగత గోప్యత, భద్రత ఏ విధంగా దెబ్బతింటుందో వివరించారు. మీ వ్యక్తిగత సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని చెప్పారు. సైబర్ క్రైమ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ గురించి చైతన్యం కల్పిస్తూ, వాస్తవ ఘటనలను ఉదాహరణగా చెప్పి అందరినీ ఆలోచింపజేశారు. బలహీన పాస్‌వర్డ్‌లు, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం వంటి పొరపాట్లు సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పిస్తాయని వివరించారు. కార్యక్రమంలో అడ్వకేట్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ మధుసూదన, సుందరేశ్వర, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సిపిఎం నగర మహాసభ

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం నగర 6వ మహాసభ ఈనెల 1న నగరంలోని రామకృష్ణ నగర్‌లో ఉన్న సిపిఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు నగర కార్యదర్శి రామ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో మూడు సంవత్సరాల కాలంలో సిపిఎం చేసిన కృషి సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామని పేర్కొన్నారు. అనంతరం సిపిఎం నగర నూతన కమిటీని ఎన్నుకుంటారని తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యురాలు ఐ.ఎన్. సుబ్బమ్మ హాజరవుతున్నారని పేర్కొన్నారు. నగరంలో ఉన్న సిపిఎం సభ్యులందరూ మహాసభలో తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1న నిర్వహించే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం తన ఛాంబర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్యం నా హక్కు' అనేనినాదంతో ఈ సంవత్సరం నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు మానసికంగా బాధపడుతున్నారని పేర్కొన్నారు. 1 నుంచి 15వరకు పాఠశాలలు, కళాశాలలు, మహిళా స్వాస్థ సంఘాలతో హెచ్ఐవి /ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అదనపు వైద్యాధికారి డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ రెండు నెలలకు ఒకసారి ట్రాన్స్ జెండర్స్‌కు, సెక్స్ వర్కర్స్‌కు హెచ్.ఐ.వి / ఎయిడ్స్ నీకు తెలుసా అనే కార్యక్రమం ద్వారా అవగాహన కలిగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, డిఐఒ, ప్రోగ్రాం ఆఫీసర్స్, డెమో, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పెన్షనర్ల సంఘం పాలాభిషేకం

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. రామమూర్తి నాయుడు మాట్లాడుతూ 15 సంవత్సరాలు ఉన్న కమ్యూనికేషన్‌ను 11 సంవత్సరాల మూడు నెలలకు తగ్గించడం హర్షణీయమన్నారు. వేల మంది పెన్షనలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గతంలో తగ్గించినా క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, కోశాధికారి నాగేష్, ఉపాధ్యక్షులు నారాయణ, సంయుక్త కార్యదర్శి శుభాన్, కార్యవర్గ సభ్యులు నాగయ్య, రాయుడు, దేవరాజ్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, పెంచలయ్య, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పెన్షనర్లు



మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : దూదేకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే బ్లడ్ క్యాంపుకు దూదేకుల సోదరులు హాజరు కావాలని రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు అక్బర్ పిలుపునిచ్చారు. శనివారం సమితి కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ 14 సంవత్సరాల నుంచి బాధ్యతగా ప్రజలకు రక్తం అందిస్తున్నామని తెలిపారు. ఎక్కువ మంది ప్రజల్లో రక్త హీనంగా ఉందని, ఆరోగ్యంగా ఉండే యువతలో చైతన్యం తెచ్చేం దుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, నాయకులు, అధికారులు హాజరవుతారని చెప్పారు. పాత కలెక్టర్ కార్యాలయం దగ్గర శిబిరంలో రక్తం ఇవ్వాలని కోరారు. సమావేశంలో దూదేకుల హక్కుల పోరాట సమితి నాయకులు జి. నజిర్, ఆర్. హుస్సేన్, జి. బాబయ్య, పి.మహబూబ్ బాషా, బి.షరీఫ్, పి. నజిర్ పాల్గొన్నారు.

అభ్యుదయ కవితా పితామహుడు 'గురజాడ' : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

నాటకరంగంలో విభిన్న రచనల ద్వారా చైతన్యాన్ని రగిల్చిన అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు భారతీయ నాటక రచయిత,నాటక కర్త అన్నారు. ఆయన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొలిపే విధంగా, సమాజ అభ్యుదయానికి ఉపయోగ పడే విధంగా ఉండేవి పేర్కొన్నారు.1892లో కన్యాశుల్కం నాటకం రచన ద్వారా ఆనాటి పరిస్థితుల్లో మహిళల ఇబ్బందులు, కట్టుబాట్లు కళ్ళకు కట్టినట్టు చూపించి ప్రసిద్ధి చెందాడన్నారు.

నిరర్థక వివాదం

ప్రజా'దృష్టి'

రాయలసీమ థర్మల్ పవర్‌ప్లాంట్ ఫ్లైయాష్ తరలింపు వ్యవహారం నిరర్థక వివాదంగా మారింది. జిల్లాలోని జమ్మలమడుగు నియో జకవర్గం ఎర్రగుంట్ల మండల పరిధిలోని కల్లమల గ్రామ సమీపంలో నిర్మితమైన ఆర్‌టిపిపి ప్లాంట్ బూడిద తరలింపుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి కుటుంబీకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. బూడిద తరలింపు వ్యవహారంతో సామాన్యులకు ఎటువంటి సంబంధం లేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంతటి స్థాయిలో ఘర్షణ పడితే ప్రజా సమస్యలు ఎప్పుడో చిటికెలో పరిష్కారమయ్యేవి. ఇద్దరు నాయకులు ఇటువంటి ప్రయత్నం చేయడం లేదు. కేవలం తమ స్వార్థప్రయోజనాల కోసమే కూటమికి చెందిన ఇద్దరు నాయకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యవహరించడం సిగ్గు చేటు. సమస్య ఏదైనా ఉంటే ఇద్దరూ కూర్చుకుని పట్టు విడుపులుగా వ్యవహరిస్తే సమస్య సమసిపోయేది. మొండిగా వ్యవహరిస్తే తెగేదాకా లాగడమే అవుతుందనే సంగతిని గ్రహించాలి. ఎవరికి ఉపయోగం ఉండకపోగా అనర్థమే అవుతుందనే సంగతిని ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్న నాయకులకు తెలియదను కోలేం. చివరికి సంబంధిత రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దగ్గర నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరికి వెళ్లడం ఉత్కంఠను కలిగిస్తోంది. ఇటువంటి ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సిఎంఒ నుంచి ముగ్గురు నాయకులకు పిలుపురావడం, దీనికి జెసి ప్రభాకర్‌రెడ్డి వెళ్లబోనని లీకులివ్వడం ఉత్కంఠను కలిగిస్తోంది. ట్రాన్స్ ఫోర్టు బకాయి చెల్లింపుల దశలోనే సమస్యను పరిష్కరించుకోవాల్సిన నాయకులు, కంపెనీల తరుపున నిలబడి పోటాపోటీగా రాజకీయం చేయడం ఏమిటో తెలియడం లేదు. ప్రజల ఓట్లను గెలిచిన ప్రజా ప్రతినిధులు ఎవరి ప్రయోజనాల కోసం పాటుపడుతున్నారో గ్రహించాల్సిన అసవరం ఎంతైనా ఉంది. మొన్న జమ్మలమడుగు నియోజక వర్గ కేంద్రంగానే ఆదానీ పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పాదన ప్లాంట్‌పై దాడి, నేడు సిమెంటు కంపెనీల మాటున కూటమి నాయకులు నిలబడి స్వార్థప్రయోజనాల కోసం పోరాటడం విస్మయాన్ని కలిగిస్తోంది. 2014 నుంచి 2024 వరకు జమ్మలమడుగు కేంద్రంగా కూటమి నాయకత్వం అరాచక పాలన సాగిస్తోంది. ఫలితంగా జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై పెనుప్రభావం చూపుతోంది. ఫలితంగా పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడానికి జంకుతున్న పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా నిరుద్యోగం తాండవం చేస్తోంది. నిరుద్యోగులు దేశాలు పట్టిపోతున్న ఘటనలు కొల్లలు. సహజంగానే కూటమి హయాంలో జిల్లాకు కొత్త పరిశ్రమలు రావు, రానివ్వరు, ఒకవేళ వచ్చినా రాజకీయ పరిపక్వత లోపం వెరసి, వైఎస్ కుటుంబ బూచిని చూపుతూ పాలకులు ఇతర ప్రాంతాలకు కంపెనీలను తరలించిన అనుభవాలు ఉన్నాయి. జిల్లాకు చెందిన కూటమి నాయకత్వం స్వార్థప్రయోజనాల కోసం పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకోవడం తగదనే సంగతి గ్రహించాలి. లేనిపక్షంలో భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసిన నాయకులుగా మిగిలిపోతారనడంలో సందేహం లేదు. ఇప్పటికైనా జిల్లా నాయకత్వం కారణంగా కొప్పర్తి ఎంఎస్ఎంఇ, అదానీ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, తాజాగా బూడిద వ్యవహారం కారణంగా జిల్లా పారిశ్రామికానికి వాటిల్లిన నష్టం ఇక చాలు, ఇంతటితో రాజకీయ క్రీడలు ఆపితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందనే సంగతిని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

నాణ్యతలో రాజీపడొద్దు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థుల భోజన విషయంలో రాజీ పడొద్దని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఇస్లాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. భోజనం స్వయంగా పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

'ఉద్యోగులను ఇబ్బంది పెట్టలేదు'

ప్రజాశక్తి - వేంపల్లె

ట్రిపుల్‌ఐటిలో ఉద్యోగులను అధికారులు ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని హౌస్ కీపింగ్ ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం ఇడుపులపాయలో హౌస్ కీపింగ్ ఉద్యోగులు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగి తమ నాయకుడిగా చెప్పుకుంటూ చెలామణి అవుతున్న వ్యక్తి తమ నాయకుడు కాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో మెయింటనెన్స్ అధికారిగా పనిచేస్తున్న అనిల్ కుమార్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ప్రతి నెల తమకు సక్రమంగా జీతాలు వస్తున్నట్లు చెప్పారు. డైరెక్టర్, ఎఓ, మెయింటనెన్స్ అధికారితో తమకు ఎలాంటి సమస్యలు లేవన్నారు. అడిగిన వెంటనే సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అధికారులు స్పందిస్తున్నారని తెలిపారు. అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో సెలవులు మంజూరు చేయడంలో అధికారులతో తాము ఎలాంటి ఇబ్బందులు పడలేదని వివరించారు.

నేడు వేంపల్లెలో మదార్ షావల్లి ఉరుసు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ హజరత్ సయ్యద్ ఖ్వాజాదర్ బార్ జిందేషా మదార్ షా వలి ఉరుసు ఆదివారం నుంచి ప్రారంభమవుతుందని దర్గా కమిటీ సభ్యుడు చాన్ బాషా తెలిపారు. అరబ్ దేశం నుండి బయలు దేరి భారత దేశంలో ప్రవేశించి సన్మార్గ, సత్ప్రవర్తన నిమిత్తం ప్రచారం చేస్తూ దైవభక్తి పారాయణులై వేంపల్లె గ్రామంలోని కాలేజీ రోడ్డులోని పాపాఘ్ని నది ఒడ్డున బిడ్డాల మిట్టలో నివాసం ఏర్పాటు చేసుకొని, దైవ చింతనలో మునిగి భక్తులకు దైవ సందేశాన్ని వినిపిస్తూ అదే ప్రాంతంలో సజీవ సమాధి అయినట్లు పూర్వీకులు చెప్పేవారు. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. గంధం రోజు ఆదివారం సాయంత్రం టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ముల్లా ఫయాజ్ ఇంటి నుండి మల్లెపూలు చాందిని, గంధంతో దర్గా వరకు ఫకీరులతో జల్సా ఊరేగింపుతో గంధం మదార్ షా వలి దర్గాకు తీసుకొస్తారు. సోమవారం రాత్రి 8 గంటలకు దావుబాయి గారి అల్తాఫ్ ఇంటి నుండి జెండా మేరవణి చేపట్టుతున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 10 గంటలకు ప్రత్యేక ఖవ్వాలి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖవ్వాలిలో రాబియా చిష్తి, ముజమ్మిల్ దరాజ్ పాల్గొంటారని తెలిపారు. బాబు బీడీ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాటు చేశారు. మండలంలోని హిందు ముస్లింలు అందరూ ఉరుసులో పాల్గొనాలని వారు కోరారు.

వరి నూర్పిడి తాత్కాలికంగా ఆపాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

ఫెంగల్ తుఫాను ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి పంట నూర్పిడి పనులు తాత్కాలికంగా మూడు రోజులు వాయిదా వేయాలని మైదుకూరు మండల వ్యవసాయాధికారి ప్రసన్న, చాపాడు ఎఒ మ్యాగీ వేర్వేరు ప్రకటనల్లో రైతులకు సూచించారు. ఇప్పటికే వరి నూర్పిడి చేసి ఉంటే ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచుకోవాలన్నారు. అధిక వర్షం పడితే నీరు నిలువ లేకుండా ప్రవహించేలా కాలువలు ఏర్పాటు చేసుకొవాలన్నారు. ధాన్యం వర్షానికి తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచలను పాటించాలని వారు కోరారు.

క్రైం కార్నర్

కన్న కొడుకును హత్య చేసిన తండ్రి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల పరిధిలోని నలుపురెడ్డి పల్లె సమీపంలో ఉన్న సుగాలి తండాలో కన్న కొడుకుని హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. సుగాలి తండాకు చెందిన కుళ్లాయప్ప నాయక్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూండేవాడు. అతనికి భార్య, కొడుకు ఉన్నారు. భార్య ఆరు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. ఆయన కుమారుడు రాజ్‌కుమార్ నాయక్ (24) తల్లి చావును తట్టుకోలేక బాధపడుతూ.. తన తల్లి అనారోగ్యంతో చనిపోవడానికి కారణం తండ్రి వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని నిర్లక్ష్యమని కుళ్లాయప్పను వేధిస్తూ, ఘర్షణ పడుతూండేవాడు. ఇలా చేయడాన్ని కుళ్లాయప్ప గతంలో పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి కుళ్లాయప్పను రాజ్‌కుమార్ కొట్టడంతో తీవ్ర మనస్తాపం చెందిన కుల్లాయప్ప శనివారం తెల్లవారుజామున మిద్దెపై నిద్రిస్తున్న రాజ్‌కుమార్‌ను రోకలిబండతో తల మీద కొట్టాడు. అక్కడికక్కడే రాజ్‌కుమార్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి మురళి నాయక్, రూరల్ సీఐ రమణ, ఎస్ఐ విష్ణు నారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకుడి దుర్మరణం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని పోట్లదుర్తి నడిగడ్డ శివాలయం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ మల్లికార్జున రాజు(40) మృతి చెందాడు. ఎర్రగుంట్ల డిగ్రీ కాలేజీలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ మల్లికార్జున రాజు ప్రొద్దుటూరు నుంచి కాలేజీకి ఎర్రగుంట్లకు వస్తుండగా ఆర్‌టిపిపి నుంచి వస్తున్న ఫ్లైయాష్ ట్యాంకర్ ఢీకొంది. ఆయన టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లికార్జునరాజు ప్రొద్దుటూరు రాజేశ్వరి కాలనీలో ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మల్లికార్జున మృతిపట్ల కాలేజీ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్థానిక బద్వేలు రోడ్డులోని వనదుర్గమ్మ గుడి దగ్గర సత్రంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. శనివారం ఉదయం సత్రంలో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు వెళ్లి చూడగా ఆమె చనిపోయి ఉంది. విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలిపారు. పోలీసులు, పంచాయతీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పూర్తి సమాచారం సేకరించి, దహన సంస్కారాలు నిర్వహించారు.

సింహాద్రిపురంలో చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో అధ్యాపకురాలు ఖైరునిషా మెడలో ఉన్న దాదాపు రూ.90 వేలు విలువచేసే 20 గ్రాముల బంగారు గొలుసును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. శనివారం సాయంత్రం వైఎస్ఆర్ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఖైరునిసా సబ్‌స్టేషన్ సమీపంలోని జగనన్న కాలనీ వెళ్లే దారిలో ప్రొద్దుటూరు బస్సు కోసం నిలిచి ఉండగా, మోటార్ బైక్ మీద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మెడలోని గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రహదారి విస్తరణకు మోక్షం కలిగేనా..!



రోడ్డు సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ముద్దనూరు

67వ జాతీయ రహదారిలో భాగంగా ముద్దనూరులో రోడ్డు విస్తరణ జరిగేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రహదారి విస్తరణ కోసం 5నెలల క్రితమే ఎన్‌హెచ్ అధికారులు సర్వే చేసి కొలతలు వేశారు. జమ్మలమడుగు రహదారిలోని శివాలయం నుండి పాత బస్టాండ్ నాలుగు రోడ్ల మీదుగా పులివెందుల రోడ్డు వరకు సర్వే చేశారు. మొత్తం 3 కిలోమీటర్లు రూ.6కోట్లతో రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ స్థలం నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు 20 మీటర్లు (65 అడుగులు) ఉన్నట్లు అధికారులు కొలతలు వేశారు. ఇందులో 18 మీటర్లు వెడల్పులో రోడ్డు, డ్రయినేజీ, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయనున్నారు. పాత బస్టాండ్ కూడలి నుంచి రైల్వేగేటు వరకు 15 మీటర్లు (49 అడుగులు) ప్రభుత్వ స్థలం ఉన్నట్లు అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించి రోడ్డు, డ్రయినేజీ, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఆ మేరకు దాదాపు 5నెలలుగా రహదారి విస్తరణ పనులు జరగలేదు. రోడ్డు విస్తరణ జరిగితే ట్రాఫిక్‌కు అంతరాయం, పార్కింగ్ సమస్య ఉండదని వాహనదారులు పేర్కొంటున్నారు. రహదారి విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

త్వరలోనే రహదారి విస్తరణ పనులు ప్రారంభిస్తాం..

జమ్మలమడుగు రహదారిలోని శివాలయం నుండి పాత బస్టాండ్, నాలుగు రోడ్ల మీదుగా పులివెందులకు వెళ్లే దారి వరకు రోడ్డు విస్తరణ జరుగుతుంది. మొత్తం 3కిలో మీటర్లు రూ.6కోట్లుతో రోడ్డు విస్తరణ ఏర్పాటు చేస్తాం. టెండర్లు కూడా పూర్తయి, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆక్రమణలు తొలగించి త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

- సురేంద్రరెడ్డి ఎఇ ఎన్‌హెచ్

రేషన్ షాపులపై నిఘా పెంచాలి

- సిఎంకు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రేషన్ షాపులపై నిఘా పెంచాలని, రేషన్ కార్డుల విషయం పునఃపరిశీలన చేయాలని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. పేద ప్రజలకు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పడుతోంది. ఇది కొంతమంది అక్రమార్కులకు కోట్ల రూపాయలను సంపాదించే ఆదాయ వనరుగా మారింది. ఇది ఒక వ్యవస్థీకృతనేరంగా జరుగుతోంది. ప్రభుత్వాలతో, రాజకీయ పార్టీలతో సంబంధం లేకున్నా యథావిధిగా జరుగుతోంది. రాష్ట్రంలో దాదాపు ఒక కోటి 57 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరిలో నిజమైన పేదలున్నారు. ప్రభుత్వ బియ్యం కోసం ఎదురుచూసే వారున్నారు. బియ్యంతో అవసరం లేకుండా ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం రేషన్ కార్డులు పొందిన వారూ ఉన్నారని తెలిపారు. ఇలాంటి వారు లక్షల మంది రేషన్ బియ్యం తినడం లేదు. ఇలాంటి వారిని గుర్తించి డీలర్లు వీరితో మాట్లాడుకొని వీరికి కిలో రూ.10 నుంచి రూ.20 ఇచ్చి బియ్యాన్ని తీసుకుంటున్నారు. వీరితో ఇంటి దగ్గరకుపోయి మిషన్‌తో వేలి ముద్ర వేయించుకోవడమో లేక మరో విధంగానో చేస్తున్నారు. స్మగ్లర్లు ప్రతి మండలంలో తమ ఏజెంట్లను నియమించుకొని బియ్యాన్ని సమీకరించి, వాహనాల ద్వారా సమీపంలో ఏర్పరచుకున్న గోడౌన్‌కు చేరుస్తున్నారని ఆరోపించారు. ప్రతి నియోజక వర్గంలో బియ్యం అక్రమ రవాణా ద్వారా ప్రతి నెల రూ.50 నుంచి రూ.60 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది నాలుగు స్టేజిలలో జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల రూ.100 కోట్లు అక్ర మార్కుల జేబుల్లోకి వెలుతుంది. ఈ వ్యవహారం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు రూ.వేల కోట్లు దుర్వినియోగమవుతోందన్నారు. దీనిపై ప్రభుత్వం విస్తృత చర్చ జరపాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో అధికారులకు రేషన్ బియ్యం అక్రమ రవాణా గురించి తెలిసినా మిన్నకుండిపోతున్నారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

అకాల వర్షం.. నేలకొరిగిన వరి పంట



నూర్పిడి దశలో నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - చాపాడు

మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వరి పంట సాగు రైతుల్లో ఆందోళన మొదలైంది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు కుందూ, బ్రహ్మంసాగర్, పెన్నా, కేసీ కెనాల్, బోరు బావుల ఆధారంగా 50వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట వెన్ను దశలో ఉంది. వర్షం పడుతుండడంతో వెన్ను దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధిక వర్షానికి వరి పంట నేల కొరిగితే ధాన్యం దెబ్బతింటుందని వాపోతున్నారు. గతేడాది సరైన వర్షాలు లేక వరి పంట సాగు తగ్గింది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో వరి పంట సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వరి రైతులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. చాపాడు మండలంలో 13వేల ఎకరాలు నూర్పిడి దశలో ఉంది. వర్షం ఇంతటితో ఆగకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కొంతమంది రైతులు నూర్పిడి చేపడుతున్నారు. ధరలు తగ్గుముఖం పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

మున్సిపల్ సమావేశం రసాభాస

- టిడ్కో ఇళ్ల అంశంపై కౌన్సిలర్ల వాగ్వాదం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశం రసాభాసగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మిదేవి అధ్యక్షతన శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో కొద్దిసేపు ప్రశాంతంగా సాగింది. అనంతరం టిడ్కో ఇళ్ల అంశం చర్చించే సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రొద్దుటూరులో టిడ్కో కొంతవరకు కట్టినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం పడగొట్టడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నెల్లూరు, కర్నూలు పట్టణాల్లో టిడ్కో ఇళ్లల్లో సంసారాలు చేస్తున్నారని సభ్యులు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల విషయం గురించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామన్నారు. ఇంతలో మహిళా కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, 5వ వార్డు కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి కల్పించుకొని గట్టిగా అరవడంతో ఒక్కసారిగా సమావేశం రసాభాసగా మారింది. ఈ ఇద్దరు కౌన్సిలర్లతోపాటు మరో వైస్ చైర్మన్ ఖాజామొహిద్దీన్ మరికొంత మంది కౌన్సిలర్లు సర్ది చెప్పబోయే సమయంలో పోలీసులు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. అనంతరం వైసిపి కౌన్సిలర్లు బయటికి వెళ్లిపోగా టిడిపికి మద్దతిచ్చే కౌన్సిలర్లు సమావేశాన్ని కొనసాగించారు. అంతకుముందు కౌన్సిలర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టూటౌన్ ఎదురుగా ఉన్న కల్వర్ట్ శుభ్రం చేస్తే మురికినీటి పారకం సజావుగా ఉంటుందన్నారు. అక్కడి నుండి మడూరు ఛానల్‌లో కలుస్తాయన్నారు. బాలాజీ నగర్‌లో మరమ్మతులు ఇంకా కొలిక్కి రాలేదనగా.. కల్పించుకున్న కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ రెండుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదని తెలిపారు. త్వరలో మళ్లీ పిలుస్తామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నిర్మించి పాతిక సంవత్సరాలు కానప్పటికీ కమిషనర్ క్వార్టర్ శిథిలావస్తకు రావడం శోచనీయమన్నారు. ప్రజాధనం ఖర్చుచేసే విషయంలో నాణ్యతను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ అధికారులు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలన్నారు. కౌన్సిలర్ గౌస్ మాట్లాడుతూ నిర్మాణాల విషయంలో నాణ్యత పాటించకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమన్నారు. కౌన్సిలర్ కమాల్ మాట్లాడుతూ నీళ్ల ట్యాంకులకు అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మించాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



వాదులాడుకుంటున్న కౌన్సిలర్లు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మండలం తువ్వపల్లి క్రాస్ రోడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం విద్యాజ్యోతి కార్యక్రమంలో భాగంగా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా సుంకులవారిపల్లె మండల కాంప్లెక్స్ సెక్రెటరీ నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని, ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుండి సేవాభావం అలవర్చుకోవాలన్నారు. తల్లి దండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్ర మం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్‌కుమారి, విశ్రాంత ఉపా ధ్యాయులు చలమయ్య, ఉపాధ్యాయులు సురేష్, వాగ్దాడం శివశంకర్, పాల్గొన్నారు.

అన్నదానం చాలా గొప్పది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అన్నదానం చాలా గొప్పదని ప్రాణదాత సేవాసమితి సభ్యులు, న్యాయవాది సుమంత్ తెలిపారు. కామేశ్వరరావు 51 వర్ధంతి సందర్భంగా శనివారం విద్యుత్ శాఖ 1104 యూనియన్ నాయకులు పరుశురామ్, శివ, బార్నబాస్ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ పాతబస్టాండ్ సమీపంలో 400 మందికి అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో సమితి చైర్మన్ సునీల్‌కుమార్, నారాయణరెడ్డి, రాజు, సూర్యనారాయణ, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సెక్రెటరీ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సెక్రటరీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్ జైల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. న్యాయవాదులను సొంతంగా ఏర్పాటు చేసుకోలేని వారు తమకు తెలిపితే వారికి ప్రభుత్వం తరపున లాయర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జైలు నుంచి ఇంటికి వెళ్లేసరికి మారిన మనిషిగా వెళ్లాలని సూచించారు. పగ, ప్రతీకారాలు మాని స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచుకోవాలని కోరారు. అనంతరం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి మాట్లాడుతూ ఈనెల 14న జరిగే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్, న్యాయవాదులు, కోర్టు, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

హిమకుంట్ల ఎస్‌సి కాలనీలో విద్యుత్ పునరుద్ధరణ

రూ.36 వేలు బిల్లులు చెల్లింపు.. మరో 38 కొత్త సర్వీసులు ఏర్పాటు


ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్ల ఎస్‌సి కాలనీకి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ ఎఇ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఎస్‌సి కాలనీలో కొన్నేళ్లుగా బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో సరఫరా నిలిపేశామన్నారు. కాలనీకి చెందిన వినియోగదారులు రూ.36 వేలు పాక్షికంగా చెల్లించారన్నారు. మరో 38 కొత్త సర్వీసుల ఏర్పాటు చేశారన్నారు. బిల్లులను పూర్తిస్థాయిలో చెల్లించేందుకు వినియోగదారులు అంగీకరించిన నేపథ్యంలో సరఫరా పునరుద్ధరణ చేశామన్నారు.


గండి అంజన్నను దర్శించుకున్న బీటెక్ రవి

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో వెలిసిన వీరాంజనేయ స్వామిని శనివారం పులివెందుల నియోజక వర్గం టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి దర్శిం చుకున్నారు. ప్రధాన అర్చకుడు కేసరి స్వామి వారి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక అర్చనలు చేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పట్టం అశోక్ కుమార్, వేంపల్లి మండలం టిడిపి పరిశీ లికుడు రఘునాథరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, పులివెందుల నియోజకవర్గం బీసీ నాయకుడు క్రిష్ణగిరి రమేష్, గండి దేవస్థాన మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు లోమడ భాస్కర్‌రెడ్డి, నిరుసుపల్లి మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



అంజన్న సన్నిధిలో బీటెక్ రవి, నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రొద్దుటూరు మున్సిపల్ కార్మిక సంక్షేమ సంఘ (సిఐటియు అనుబంధం) కార్యదర్శి సాల్మన్ కోరారు. ఆ మేరకు శనివారం ఆయన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి, కమిషనర్ మల్లికార్జునకు, ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవికి, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ సకాలంలో పరికరాలు ఇవ్వాలన్నారు. నగర దీపికలకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, అవి వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. క్యాప్ ఆటోలు మరమ్మతులు చేయించాలనే తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

'గురజాడ' నవయుగ వైతాళికుడు

ప్రజాశక్తి - వేంపల్లె

గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కాంగ్రెస్ మండల కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం గురజాడ 109వ వర్ధంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అనే దేశభక్తి సందేశాన్ని అందించిన నిజమైన దేశభక్తుడు గురజాడ అన్నారు. స్త్రీ జనోద్ధరణ, సంఘసంస్కరణ, భాషోద్యమం గురజాడ నడిపించాడని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రాజా, వెంకటేష్, మహబూబ్ బాషా, బాలం సుబ్బరాయుడు, ఆరుసేర్ల సుబ్బ రాయుడు, రాజు వినయ్, రవి, వేమయ్య, రమణ పాల్గొన్నారు.

రోశయ్య రాజకీయ భీష్మాచార్యులు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య రాజకీయ భీష్మచార్యుడు, అజాత శత్రువని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన రోశయ్య 4వ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తులసిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా మాజీ అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌతం, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.




ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్స్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ జబ్బుకు కారణమైన హెచ్ఐవి క్రిమి ప్రధానంగా లైంగికంగా వ్యాప్తి చెందుతుందన్నారు. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి వ్యాప్తికి దానిపట్ల అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. కరస్పాండెంట్ ఎల్ తరునేంద్ర శేఖర్, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, అధ్యాపకులు, సిబ్బంది హెచ్ఐవి ఎయిడ్స్‌పై ప్రతిజ్ఞ చేశారు.



చెన్నారెడ్డి దంపతులను సన్మానిస్తున్న తెలుగు భాష ప్రతినిధులు

విద్యార్థులను తీర్చిదిద్దిన చెన్నారెడ్డి

చాపాడు : నేల తల్లిని నమ్ముకున్న రైతుబిడ్డ కుమారుడు తెలుగు ఉపాధ్యాయుడు బొగ్గుల చెన్నారెడ్డి అని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. మండలంలోని లక్ష్మీపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు బొగ్గుల చెన్నారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం సన్మాన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ తన స్నేహితుడు సహచర విద్యార్థి బొగ్గుల చెన్నారెడ్డి మూడు దశాబ్దాల తన సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఉద్యోగ విరమణ చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. చిన్ననాటి నుండి అందరితో కలిసిపోయే చెన్నారెడ్డి ఉపాధ్యాయ జీవితంలో కూడా ఎంతోమంది విద్యార్థులను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థితిలో ఉన్నారని చెప్పారు. అందుకు ఉదాహరణ రాయలసీమ కథా సాహిత్య పరిశోధకుడు అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య చెన్నారెడ్డి శిష్యుడు కావడం తనకెంతో గర్వ కారణంగా ఉందన్నారు. ఒక నాటి విద్యార్థి ఉపాధ్యాయుల అనుబంధానికి చెన్నారెడ్డి నిలువెత్తు సాక్ష్యమన్నారు. డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులకు మధ్య ఉన్న అనుబంధమే గొప్ప సమాజాన్ని నిర్మించగలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపేట ఉన్నత పాఠశాల ఉపా ధ్యాయులు, ఆయన మిత్రులు, బంధువులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.